క్లుప్తంగా

'మార్గదర్శి-బంగారు కుటుంబం' ఆన్‌లైన్ పూర్తి చేయండి



కార్యదర్శులకు సూచనలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పీ4 సర్వే అనంతరం మార్గదర్శి-బంగారు కుటుంబం ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కార్యదర్శులను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఇదే విషయమై ఆయన నగరంలో కార్యదర్శులతో గురువారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియపై ప్రభుత్వ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఆ మేర ప్రతి డివిజన్‌లో పీ4 సర్వే జరిగినానంతరం మార్గదర్శి-బంగారు కుటుంబం ఆన్‌లైన్‌ను వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



పాలడబ్బాలు పరిశీలిస్తున్న విమలరాణి

విజయనగరం ఫోర్ట్: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి టి.విమలరాణి సూచించారు. స్థానిక కేఎల్ పురంలోని శిశుగృహాన్ని ఆమె గురువారం సందర్శించారు. గృహ పరిసరాలతో పాటు ఆహార పట్టిక, పాలడబ్బాలు, రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పౌష్టికాహార విలువలతో కూడిన ఆహారం పిల్లలు పొందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో శిశుగృహం మేనేజర్ జి.త్రివేణి, సోషల్ వర్కర్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పాలిథిన్ విక్రయాలపై తనిఖీలు



వీధి దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది

విజయనగరం: నగరంలో నిషేధిత పాలిథిన్ విక్రయాలపై ప్రజారోగ్య సిబ్బంది గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి దుకాణానికి వెళ్లి, నిషేధించిన పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారా లేదా అనేది పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విక్రయిస్తున్న నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకుని, అపరాధ రుసుం విధించారు. ఎవరైనా, ఎక్కడైనా నిషేధిత పాలిథిన్ సంచులు గానీ ప్లాస్టిక్ వస్తువులు గానీ వినియోగించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ప్రజారోగ్యాధికారి కె.సాంబమూర్తి హెచ్చరించారు. అక్టోబరు 2వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి పకడ్బందీ చర్యలు చేపడుతోందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: మహిళా ఉద్యోగులు, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎదురవుతున్న లైంగికదాడులను ఏ విధంగా నివారించాలో అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. లైంగికదాడులు నివారణలో భాగంగా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ వేయనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు, విద్యార్థినుల పట్ల సోదరిభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ దేవిమాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘ భవనంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కలిశెట్టి రవిబాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఉదయం 9.30 గంటలకు శిబిరం ప్రారంభిస్తారని, ఈ అవకాశాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత

- నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు



డెంకాడ: చింతలవలస సభలో ప్రభుత్వ మోసాలను ఎండగడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతలవలస, బొడ్డవలస, మోదవలస, జొన్నాడ, కొండరాజుపేట, బంగార్రాజుపేటల్లో గురువారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి సర్కారు ప్రజలను మోసం చేస్తున్న తీరును వివరించారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. ఈ క్రమంలో కొంతమంది కూటమి పాలనలో పడుతున్న కష్టాలను చెప్పుకున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొని, కూటమి చేస్తున్న దుష్టపాలనను ఎండగట్టారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఓట్లు, అధికారం కోసం ఎంతవరకైనా దిగజారుతారని దుయ్యబట్టారు. అధికారం చేపట్టిన దగ్గర నుంచి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులు మొదలుపెట్టేశారని, ఇప్పటివరకు కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రక్తపాతం సృష్టించారని ధ్వజమెత్తారు.

అక్రమ కేసులతో వేధింపులు..

అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదురించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఇలాంటి రాజకీయాలు వారికి మామూలే కావొచ్చు కానీ ప్రజాస్వామ్యంలో ఇలాంటి నీచ సంస్కృతి సరికాదన్నారు. ఏ పథకాలు పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారో ఆ పథకాలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుపై ప్రజలు నిలదీయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారన్నారు. కూటమి హామీలకు తాను గ్యారంటీ అనే పవన్ కల్యాణ్ సైతం ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదన్నారు. హామీలన్నీ అమలు చేయకుండానే అన్ని హామీలు అమలు చేసేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలు ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. ఇవేవీ ఇవ్వకుండా అభివృద్ధి పనులు చేయకుండా ఏడాది పాలన గొప్పగా చేశామని కార్యక్రమం చేసుకుని సంబరపడిపోతున్నారని, అయితే అది చూసి జనం నవ్వుకుంటున్నారని విషయం బహుశా వారికి తెలియడం లేదేమోనని ఎద్దేవా చేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమం ఆగలేదన్నారు. ఓ వైపు కరోనా మహమ్మారిని నివారిస్తూనే సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అందించిన ఘనత నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ఉద్యోగాలెవరికిచ్చారో చెప్పాలి?

ఇప్పటికే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి కూడా తనను గెలిపిస్తే 100 రోజుల్లో 100 కంపెనీలు నియోజకవర్గానికి తీసుకువచ్చి, నిరుద్యోగాన్ని రూపుమాపుతానన్నారని, ఆమె తెచ్చిన కంపెనీలు ఎక్కడున్నాయో.. ఆమె ఎవరికి ఉద్యోగాలు ఇప్పించారో తెలియజేయాలన్నారు. అటు రాష్ట్రంలోనూ ఇటు నియోజకవర్గంలోనూ పాలన భ్రష్టు పట్టిందన్నారు. ఇప్పటికీ ఏ గ్రామం వెళ్లినా వైఎస్సార్ సీపీ హయాంలో వేసిన సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్లే కనిపిస్తున్నాయని, అది కదా అభివృద్ధి అని అన్నారు. మాటలు మాని ప్రజలకు మంచి చేయాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమాల్లో డెంకాడ, నెల్లిమర్ల మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు, గదల సన్యాసినాయుడు, నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, కోరాడ కోటినాయుడు, కరుమజ్జి త్రినాధరావు, త్రిపురగిరి మురళి, పిన్నింటి సత్యారావు, ఎర్ర శ్రీనివాసరావు, సరగడ బంగారురెడ్డి, లెంక లక్ష్మణరావు, కోరాడ కనకరాజు, పతివాడ కృష్ణవేణి, రేగాన శ్రీనివాసరావు, బమ్మిడి వెంకటరమణ, పాంద్రంకి ఆదినారాయణ, కాళ్ల రామసూరప్పడు,కిట్టు,బోని హర్ష, ఆది,వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డెంకాడ: బొడ్డవలస సభలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, నాయకులు

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

విజయనగరం అర్బన్: నగరంలో సెప్టెంబరు 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక(జేవీవీ) 18వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక గురజాడ అప్పారావు నివాసం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మహాసభల పోస్టరు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పాటుపడుతున్న జేవీవీలో ఎంతో మంది విద్యావంతులు, అభ్యుదయవాదులు, ఉపాధ్యాయులు, కళాకారులు, వైద్యులు, శాస్త్రవేత్తలు భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో జేవీవీ నుంచి మరిన్ని మంచి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో జేవీవీ జిల్లా అధక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీఎస్ వెంకటరావు, రమణప్రభాత్, గౌరవాధ్యక్షుడు కె.శివానంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఆలోచన మానుకోవాలి



సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెట్టే ఆలోచనను మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టీవీ రమణ, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్బీజీ భవన్‌లో రౌండ్ టేబుల్, విలేకరుల సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అదాని షిర్డీసాయి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. వామపక్షాలు, ప్రజాసంఘాలు దీనిని వ్యతిరేకిస్తూ పోరాటం సాగిస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన మంత్రి లోకేష్..ఇప్పుడు అవే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును స్వాగతిస్తుండడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు.. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రెండూ అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని, ఇవి ప్రజావ్యతిరేకతను మూటగట్టుకోవడం ఖాయమన్నారు. స్మార్ట్‌మీటర్ల స్థానంలో పాతమీటర్లే కొనసాగించాలన్నారు. ట్రూఅప్ చార్జీల పేరిట ఇప్పటికే రూ.16,800 కోట్ల వరకు అదనంగా వసూలు చేశారన్నారు. ఈ ఏడాది విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థకు రూ.1200 కోట్ల మిగులు ఉన్నా యూనిట్‌కి 40 పైసలు చొప్పున వసూలు చేసి ప్రజలపై రూ.2,700 కోట్ల భారాన్ని మోపారని ధ్వజమెత్తారు. కొన్నిచోట్ల స్మార్ట్‌మీటర్లు పెట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తామని, బిల్లులు పెంచుతామని బెదిరిస్తుండడం అన్యాయమన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ముందడుగు వేస్తుండడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వి.లక్ష్మి, సురేష్, శ్రీనివాసరావు, రమణమ్మ, రమణ, రవికుమార్, హరీష్, సతీష్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు రవి, శారదలు

విజయనగరం టౌన్: స్థానిక ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో గురువారం సాయంత్రం చేపట్టిన సంగీత కచేరీ అలరించింది. కళాకారులు డాక్టర్ మండపాక రవి, శారదలు చేసిన భక్తిగీతాలాపనలతో కూడిన కచేరీ ఆద్యంతం వీక్షకులను మంత్రముగ్దుల్ని చేసింది. వందే ఉమానందనం అనే గణపతి స్తుతిగీతంతో ప్రారంభమైన కార్యక్రమం ఆదిభట్ల, తూము లక్ష్మీనరసింహదాసు, భద్రాచల రామదాసు, పురంధరదాసు, త్యాగరాజస్వామి కీర్తనల ఆలాపన వరకు సాగింది. కార్యక్రమంలో కళాకారులు ఎం.ఈశ్వరమ్మ, మహేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షులు దవళ సర్వేశ్వరరావు, యామిజాల ప్రభాకర సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో విద్యతో ఉద్యోగావకాశాలు అపారం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ, సత్య విద్యాసంస్థల కార్యదర్శి బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: డిప్లమో విద్యనభ్యసిస్తే ఉద్యోగావకాశాలు అపారమని(అధికం) మాజీ ఎంపీ, సత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(సీతం), ఎస్‌బీటీఈటీకి అనుబంధంగా స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డిప్లమో తరగతుల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, కాసేపు మాట్లాడారు. సాంకేతిక విద్యను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, అలాగే విలువల ఆధారిత విద్యనూ పొందాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్‌రావు మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా స్కిల్ ఓరియెంటెడ్ ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, వర్క్ షాపులను సద్వినియోగం చేసుకుంటే ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి, విభాగాధిపతి సీహెచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన



విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో ఖరీఫ్ పంటల సాగుపై గురువారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా శిక్షణ కేంద్రం కో-ఆర్డినేటర్ భారతి, మండల వ్యవసాయాధికారిణి శ్రీలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం ఏవో గోవిందమ్మ, ఏవో నిర్మల.. వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు విత్తనాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు నాగరాజు, రమేష్, మాజీ సర్పంచ్ రాంబార్కి రామారావు, పంచాయతీ కార్యదర్శి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నంలో ఇటీవల చోటుచేసుకున్న పొలం గట్టు వివాదంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అచ్చింనాయుడు చేతిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు సామంతుల రమణ, మరో యువకుడు చనమళ్ల గౌతమ్‌లను ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పరామర్శించారు. ఆ గ్రామానికి గురువారం వెళ్లిన ఎమ్మెల్సీ..బాధితులను కలిసి కొట్లాట ఘటనపై ఆరాతీశారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప అధికారం ఉందని ఇలా గొడవలు పడడం సరికాదన్నారు. బాధితులు త్వరగా కోలుకోవాలని, పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త సభ్యులు

విజయనగరం అర్బన్: స్థానిక పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ కార్యాలయ భవనంలో ఏపీ(ఆంధ్రప్రదేశ్) పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పరిషత్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కె.ఎస్.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా వి.ఎ.వర్మ, ఎం.హేమలత, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.బి.శ్రీనివాసరావు, సెక్రటరీగా జి.హరిబాబు, కోశాధికారిగా ఎ.రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీగా పి.ఎం.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.ఎస్.ఎన్.మూర్తి, జి.ఎస్.వి జయరాజ్, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.కృష్ణ, బి.వనిత, ఎస్.వి.ప్రసాద్, పి.వి.రమణమూర్తి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వై.ఆనంద్‌కుమార్, కె.రాజ్‌కుమార్, అప్పు సురేష్, సి.హెచ్.మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయనగరంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమ షెడ్యూల్ వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం: నగరపాలక సంస్థ పరిధిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు తెలిపారు. ఇదే విషయమై వారు మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద గురువారం సమావేశం నిర్వహించి, బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమ బ్రోచర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ప్రభుత్వం మోసగిస్తున్న తీరును తెలియజేయడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. మొత్తం 50 డివిజన్‌లలో ఈ కార్యక్రమం ఉంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు. 18న 2వ డివిజన్‌లో, 19న 13వ డివిజన్‌లో, 20న 30వ డివిజన్‌లో, 21న 47వ డివిజన్‌లో, 22న 22వ డివిజన్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొంటారని, ఈ 13 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయం, అక్రమాలను వివరించి, ప్రజలను చైతన్యం చేయనున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి అమలు చేయాలని, అంతవరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఆగదన్నారు.

'సాక్షి' ప్రసారాలు నిలిపివేయడం దుర్మార్గం..

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పేరొందిన మీడియా స్వేచ్ఛను హరించడంలో కూటమి ముందుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలియజేస్తోందన్న ఒక్క కారణంతోనే సాక్షి చానల్ ప్రసారాలను కూటమి నిలిపివేసిందని మండిపడ్డారు. ఇది అన్యాయం కాదా అని నిలదీశారు. తక్షణమే సాక్షి ప్రసారాలు పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను అడగాలని, లేకుంటే నెలవారీ చెల్లించే మొత్తాలను చెల్లించవద్దని సాక్షి టీవీ ప్రేక్షకులను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్లు బండారు ఆనంద్, పట్నాన పైడిరాజు, పార్టీ నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్, రెడ్డి గురుమూర్తి, లక్ష్మణరావు, రామేశ్వరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గాయత్రి

పూసపాటిరేగ: వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా గేదెల గాయత్రి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమె గతంలో నెల్లిమర్ల మండలం, దనాన్నపేట సర్పంచ్‌గా పని చేయగా, ఈమె భర్త గేదెల రాజారావు మండల టీడీపీలో ముఖ్య నాయకుడిగా ఉన్నారు.

టోల్‌ప్లాజాలో ఉద్యోగాలకు టీటీడీసీలో ఇంటర్వ్యూలు రేపు

విజయనగరం టౌన్: నగరంలోని టీటీడీసీలో సీడాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీసాయి ఎంటర్‌ప్రైజస్ లిమిటెడ్ కంపెనీ టోల్‌ప్లాజాలో ఉద్యోగాలకు ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సావిత్రి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారంతా తమ విద్యార్హతలు తెలిపే ధ్రువపత్రాలు, బయోడేటాతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8074726936ను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య సేవలందించడంలో ఆశ కార్యకర్తలే కీలకం



సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో జీవనరాణి తదితరులు

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశ కార్యకర్తలదే కీలకపాత్ర అని డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 1775 మంది ఆశ కార్యకర్తలకు యూనిఫాం గురువారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వ్యాధుల బారినపడకుండా చేపట్టే చర్యల్లో ఆశ కార్యకర్తలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో సీహెచ్‌వో చంద్రశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

మోహన్ మాస్టారు సేవలు చిరస్మరణీయం



మోహన్ మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

విజయనగరం టౌన్: సాహితీరంగానికి తంగుడిబిల్లి మోహన్ మాస్టారు చేసిన సేవలు చిరస్మరణీయమని రచయిత్రి సుభాషిణి కొనియాడారు. నగరంలోని ఉడా కాలనీలో మోహన్ మాస్టారు స్మారక గ్రంథాలయంలో నరసింహం ఫౌండేషన్, సరోజిని మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మోహన్ మాస్టారు జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాహిత్యంతో సమాజ చైతన్యానికి మోహన్ మాస్టారు చేసిన సేవలను గుర్తు చేశారు. వివిధ అంశాలపై 18 పుస్తకాలు రాసి, ఒకేసారి ఆవిష్కరించిన ఘనత మోహన్ మాస్టారుకే దక్కుతుందన్నారు. అనంతరం గ్రంథాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మోహన్ మాస్టారు సతీమణి ఈశ్వరీమోహన్, ప్రతినిధులు ప్రసాద్, గౌరీశ్వరరావు, ఎర్నాయుడు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

20న భారీ ఊరేగింపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకుడు వెంకటరమణ సిద్ధాంతి తదితరులు

విజయనగరం టౌన్: నగరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ భారీ ఊరేగింపు ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి గురువారం తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆలయం వద్ద గురువారం మాట్లాడుతూ ఊరేగింపు కరపత్రాలు ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేసినానంతరం ఫూల్‌బాగ్ ఆలయం నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు, అంబటిసత్రం, మూడులాంతర్ల జంక్షన్ మీదుగా కోట, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, పాతబస్టాండ్ మీదుగా దేవాలయం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు.